సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 22 । జనవరి । 2024



యోధుల మధ్య పోరు
కమాండోల శక్తిసామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలను అంచనా వేసేందుకు పోటీలు నిర్వహించనున్నారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. 8లో



కేజీహెచ్‌లో కొత్త ఐసీయూ
కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ వార్డులో ఆరు పడకలతో న్యూ ఐసీయూను ఆదివారం ప్రారంభించారు. 8లో

న్యూస్‌రీల్

చిరుధాన్యాలతో రాముడి రూపం



అయోధ్య రామమందిరం

ఏయూక్యాంపస్ : అయోధ్యలో జరుగుతున్న రామమందిర ప్రతిష్ఠ మహోత్సవాలను దేశ వ్యాప్తంగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ చారిత్రక ఘట్టం జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని విశాఖ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ మిల్లెట్స్‌తో అయోధ్య రామమందిరం, శ్రీరామచంద్రుడి రూపాలను తీర్చిదిద్దారు. దాదాపు వారం రోజులుగా నిత్యం ఎనిమిది గంటలకు పైగా పనిచేస్తూ దీనిని తీర్చిదిద్దారు.

డోలీలో గర్భిణి తరలింపు



గర్భిణిని డోలీలో తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: నిండుగర్భిణిని డోలీలో ఏడు కిలోమీటర్లు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ రాచకీలం గ్రామానికి చెందిన సూకురు చిన్నలమ్మకు నెలల నిండడంతో ఆదివారం పురిటి నొప్పులు అధికమయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చేపరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను దట్టమైన అటవీప్రాంతం మీదుగా డోలీలో సుమారు ఏడు కిలోమీటర్లు మోసుకుని బల్లగరువుకు తీసుకువచ్చారు.అక్కడ నుంచి అంబులెన్స్‌లోని పినకోట పీహెచ్‌సీకి తరలించారు.

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్




ఘాట్‌రోడ్డులోని మలుపు వద్ద నిలిచిపోయిన లారీలు

మారేడుమిల్లి: మండల కేంద్రం మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులోని వాలీసుగ్రీవ మలుపు వద్ద రెండు లారీలు అడ్డుగా నిలిచిపోవడంతో ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. చింతూరు నుంచి పెద్దాపురానికి ఊక లోడుతో వెళ్తున్న లారీ, మారేడుమిల్లి వైపు నుంచి ఛత్తీస్‌గఢ్‌వైపు వెళుతున్న మరో లోడు లారీ ఘాట్‌రోడ్డులోని వాలీసుగ్రీవ్ మలుపులో ఇరుక్కుపోయాయి. దీంతో ఇరువైపులా భారీ వాహనాలు, బస్సులు నిలిచిపోయాయి. రెండు గంటల అనంతరం లారీలను పక్కకు తీయడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి.

గిరిజన యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

అడ్డతీగల: ఐటీడీఏ, అభి టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో రంపచోడవరం డివిజన్ పరిధిలోని నిరుద్యోగ గిరిజన యువతకు స్థానిక వైటీసీలో ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. శిక్షణ అనంతరం ఎల్ఎల్ఆర్ మంజూరు చేస్తామన్నారు. లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) డ్రైవింగ్ శిక్షణకు కనీస విద్యార్హత 8వ తరగతి అని, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. శిక్షణ పొందగోరే అభ్యర్థులు ఆధార్, తెల్ల రేషన్ కార్డు, కులధ్రువీకరణ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు, రెండు కలర్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉచితంగా వసతి కల్పించనున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అడ్డతీగల యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గాని, 63038 46338, 85002 28131 అనే ఫోన్ నంబర్లలో గాని సంప్రదించవచ్చని తెలిపారు.

ఫిట్స్‌తో బాలిక మృతి



కావ్య మృతదేహం

కొయ్యూరు: మండలంలోని చింతలపూడికి చెందిన ఐదేళ్ల బాలిక ఫిట్స్‌తో మృతిచెందింది. చింతలపూడి మినీ అంగన్‌వాడీ టీచర్ పోలోజు లోవకుమారి కుమార్తె కావ్యకు ఆదివారం తెల్లవారుజామున ఫిట్స్ రావడంతో నర్సీపట్నం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే బాలిక మృతిచెందింది. శనివారం రాత్రి కృష్ణదేవిపేటలో జరిగిన తీర్థానికి కుటుంబ సభ్యులతో కలిసి కావ్య వెళ్లింది. అక్కడ నుంచి ఇంటికి చేరుకున్న బాలికకు తెల్లవారుజామున ఫిట్స్ రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందింది.

3 జిల్లాలు ... 390 కిలోమీటర్లు
హై వేగంగా..



గంగవరం వద్ద పూర్తయిన రహదారి

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పూర్తయిన 82 కిలోమీటర్ల హైవే పనులు
- రూ.568 కోట్ల వ్యయంతో ప్రారంభమైన మరో 70 కిలోమీటర్ల నిర్మాణం

రంపచోడవరం: రాజమహేంద్రవరం- విజయనగరాన్ని కలుపుతూ ప్రారంభించిన హైవే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తూర్పు కనుమల్లో గ్రామాలను కలుపుతూ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే అరకు అందాలు తిలకించిన పర్యాటకులు రంపచోడవరంలో ప్రకృతి సౌందర్యాన్ని చూసేందుకు రావడానికి దగ్గర మార్గం అవుతుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటకంగా మరింత అభివృద్ధి సాధించేందుకూడా వీలు కలుగుతుంది. కృష్ణదేవిపేట, అడ్డతీగల, రంపచోడవరం, మారేడుమిల్లి, కొయ్యూరు తదితర ప్రాంతాల్లో పర్యాటక స్థలాలను సులభంగా సందర్శించేందుకు అవకాశం ఏర్పడుతుంది. పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తే జిల్లా వాసులకు ఉపాధి అవకాశాలు ఎక్కువ అవుతాయి. మూడు ఉమ్మడి జిల్లాలను కలుపుతూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ బ్యాంకు నిధులతో రాజమహేంద్రవరం- విజయనగరం మధ్య 390 కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్డు పనులను మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలో నేషనల్ హైవే అథారిటీ ఇంజినీర్లు పనులు పర్యవేక్షణ చేస్తున్నారు.



ఐ పోలవరం నుంచి గంగవరం వెళ్లే మార్గంలో పూర్తయిన రోడ్డు

ఐ.పోలవరం నుంచి కృష్ణదేవిపేట వరకు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నుంచి ఏజెన్సీలో ఐ.పోలవరం జంక్షన్ వరకు 43 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని ఇప్పటికే పూర్తి చేశారు.

- గోకవరం వద్ద వంతెన నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఈ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
- ఐ.పోలవరవం నుంచి కృష్ణదేవి పేట వరకు 70 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు రూ.568 కోట్ల వ్యయంతో ప్రారంభించారు.
- ఇప్పటికే 39 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- ఈ మార్గంలో 193 శ్లాబ్ కల్వర్టులు, పైప్ కల్వర్టులు నిర్మిస్తారు.
- వీటిలో 130 కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు.మరో 63 కల్వర్టుల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన రోడ్డు నిర్మాణ కోసం పనులు వేగంగా జరుగుతున్నాయి.
- రోడ్డు నిర్మాణ పనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రంపచోడవరం రెవెన్యూ శాఖ భూమిని అప్పగించింది.
- అటు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో కూడా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆరు భాగాలుగా విభజించి పనులు చేస్తున్నారు.

కొన్ని భవనాలు తొలగించాలి

రాజమహేంద్రవరం నుంచి కృష్ణదేవి పేట వరకు పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నాను. కల్వర్టుల నిర్మాణం పూర్తయితే పనులు పూర్తయినట్టే. రోడ్డు నిర్మాణపనులను దాదాపుగా 55 శాతం పూర్తి చేశాం. రోడ్డు నిర్మాణానికి రెవెన్యూశాఖ భూమిని అప్పగించింది. కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలంలో ఉన్న ప్రైవేట్ భవనాలు తొలగించాల్సి ఉంది. గడువు కంటే ముందే పూర్తి చేసేందుకు వేగంగా పనులు చేస్తున్నాం.

– పి.బి.చక్రవర్తి, ఏఈ(ఆర్అండ్‌బీ), నేషనల్ హైవేస్ సెక్షన్, కాకినాడ

టీడీపీ అంటే ట్రైబల్ ద్రోహుల పార్టీ

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొటగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు : టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పొలిటికల్ లీడర్ కాదని, ఆయన పొలిటికల్ టూరిస్ట్ అని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అంటే ట్రైబల్ ద్రోహుల పార్టీ అని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులు అన్ని విధాలుగా దగా పడ్డారన్నారు. బాక్సైట్ జీవో 97ను జారీ చేసి గిరిజనులకు ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకొని మళ్లీ అరకు ప్రాంతానికి వచ్చారన్నారు. అరకులో జరిగింది ఓ మాయ సభ అని ఆమె విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. పోడు చేస్తున్న గిరిజనులకు ఏకంగా 1.50లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని తెలిపారు. గిరిజనులు పండిస్తున్న కాఫీ పంటకు అరకు కాఫీగా నామకరణం తానే చేశానని చంద్రబాబు చెప్పుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. నాడు కాఫీ గింజల కొనుగోలును ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి గిరిజనులకు ఆర్థికంగా నష్టం చేసిన ఘనత చంద్రబాబుదేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోలోకి వచ్చాక కాఫీ రైతుల కోసం జీకే వీధిలో రూ.235 కోట్లతో, జి.మాడుగులలో 100 కోట్లతో, చింతపల్లిలో 205కోట్లతో ఎకో పల్పింగ్ యూనిట్లను నెలకొల్పామని, కొయ్యూరు మండలం డౌనూరులో రూ.4 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పుతున్నామని తెలిపారు. టీడీపీ హయాంలో ఏజెన్సీలో గంజాయి పంటను ప్రోత్సహించారని, అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు గంజాయి వ్యాపారం చేశారని ఆమె ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సుమారు 7,500 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేసి, గిరిజనులను ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించామని తెలిపారు. జీవో నంబర్ 3పై అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎందుకు చట్టం చేయలేదన్నారు. జీవో నంబర్ 3ను సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి సుమారు 1.15 లక్షల మంది గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అందిస్తున్నామని చెప్పారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ కోసం పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, ఆస్పత్రుల అప్‌గ్రేడ్, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ, గ్రామగ్రామానా జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

సుమారు 2వేల సెల్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. అరకు పార్లమెంట్ పరిధిలోని గిరిజన ఎమ్మెల్యేలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. తనకు 100 ఎకరాల మైనింగ్ భూములు ఉన్నాయని ఆరోపణలు చేయడం చంద్రబాబు అవివేకానికి నిదర్శనమన్నారు. తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను తక్షణమే రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పంచయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి, పార్టీ సీనియర్ నాయకుడు మినుముల కన్నాపాత్రుడు పాల్గొన్నారు.

గిరిజనులంటే చంద్రబాబుకు చిన్న చూపు

- అరకు బహిరంగ సభలో బాబు చెప్పినవన్నీ అబద్ధాలే
- వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరకు బహిరంగ సభలో మాట్లాడిన మాటలన్నీ సత్యదూరాలేనని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నారని, కానీ చంద్రబాబును, టీడీపీని నమ్మే పరిస్థితిలో గిరిజనులు లేరన్నారు. చంద్రబాబు 14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఏనాడు రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోలేదని చెప్పారు. 2014 ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం రోజున బాక్సైట్ జీవో నంబర్ 97ను జారీ చేసింది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. ఆనాడు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షాన ఉండి పోరాటాలు చేశారని, అధికారంలోకి వచ్చిన కొన్ని రోజులకే గిరిజనులకు ప్రాణ సంకటంగా ఉన్న బాక్సైట్ జీవో 97ను రద్దు చేశారని చెప్పారు. 2014లో గిరిజనులకు మంత్రి పదవి, ఇతర పదవులు ఇవ్వకుండా చంద్రబాబు తీవ్రంగా అవమానపరిచారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సామాజిక న్యాయం పాటిస్తూ గిరిజనులను గౌరవిస్తూ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు ఎస్టీ కమిషన్, జీసీసీ, ట్రైకార్ చైర్మన్ పదవులను భర్తీ చేయడమే కాకుండా, ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల గిరిజనులకే అధిక శాతం లబ్ధి చేకూరిందని తెలిపారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ గిరిజన పక్షపాతి అయితే చద్రబాబు గిరిజనులను భక్షించుకు తినే మనిషి అని విమర్శించారు. చంద్రబాబు నాయుడు బూటకపు మాటలకు గిరిజనులు మోసపోయే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబు నాయుడు, లకే రత్నాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పర్యాటక కేంద్రాలు



పర్యాటకులతో కిటకిటలాడుతున్న చెరువులవెనం



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

పోటెత్తిన సందర్శకులు

సాక్షి, పాడేరు /చింతపల్లిరూరల్/డుంబ్రిగుడ/ అరకులోయ టౌన్/జి.మాడుగుల/రాజవొమ్మం / గిఅనంతగిరి: జిల్లాలో పర్యాటకకేంద్రాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌కు పర్యాటకులు పోటెత్తారు. వేకువజాము నుంచే భారీగా వంజంగి శిఖరాలకు చేరుకుని ఇక్కడ పొగమంచు,సూర్యోదయం అందాలను వీక్షించారు.

చింతపల్లి మండలంలోని లంబసింగి, చెరువుల వెనం వ్యూపాయింట్, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, అరకులోయలోని పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియం, మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్లు పర్యాటకులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సెలవుల్లో పద్మాపురం ఉద్యానవనాన్ని అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. రోజు రూ.1 లక్ష చొప్పున రూ.12 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్టు మేనేజర్ లకే బొంజుబాబు తెలిపారు. జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి సందడి చేశారు. జలపాతంలో గంటల తరబడి జలకాలాడారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు.



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

రాజవొమ్మంగి మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రకృతి ప్రేమికులు జడ్డంగి, రాజవొమ్మంగి, వంచంగి, అమ్మిరేఖల తదితర గ్రామాలకు సమీపంలో గల దట్టమైన అటవీ ప్రాంతాల్లో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ గడిపారు. అమ్మిరేఖల వద్ద గల చీకుధార జలపాతం, జడ్డంగి వద్ద గల మడేరు వాగులో స్నానాలు చేశారు. అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో మండలంలో ఎటుచూసినా సందడి వాతావరణం నెలకొంది.

బొర్రా గుహలకు రూ.3.50 లక్షల ఆదాయం

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. బొర్రాగుహలను తిలకించేందుకు కిరండూల్ పాసింజర్ రైలుతో పాటుగా ప్రైవేటు వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివచ్చారు. పర్యాటకుల రాకతో జిప్‌లైన్, బొర్రాగుహలు ప్రాంగణం సందడిగా మారాయి. నాలుగు వేల మంది గుహలను సందర్శించగా రూ.3.50 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.



మడేరు జలపాతం వద్ద సందర్శకులు



పద్మాపురం ఉద్యానవనంలో పర్యాటకుల సందడి



బొర్రాగుహలను తిలకిస్తున్న పర్యాటకులు



చాపరాయి వద్ద..

భద్రాద్రికి భక్తుల పాదయాత్ర



లక్ష్మీపురం చేరుకున్న రామభక్తులు

ఎటపాక: ఒడిశా ,ఆంధ్రా నుంచి తెలంగాణాలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకునేందుకు రామభక్తులు కాలినడకన వస్తున్నారు. ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల మూరుమూల గ్రామాలైన చిత్రకొండ, మోతుగూడెం, వలస గడ్డ, మంగంపాడు నుంచి సుమారు 150 మంది గిరిపుత్రులు విశ్వనాథ్, భగవాన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. వారంతా లక్ష్మీపురం గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు రంబాల నాగేశ్వరరావు తదితరులు వారికి ఆహ్వానం పలికారు. పూజాది కార్యక్రమాలు చేసి భోజనాలు ముగించుకుని భక్తులు భద్రాచలం బయలుదేరారు. అయోధ్య రామ మందిరంలో సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సమయానికి భద్రాద్రి చేరుకొని, వైకుంఠ రాముడిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

ఘనంగా మోదమ్మ తీర్థ మహోత్సవం



మోదకొండమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఒకరోజు తీర్థ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి మోదమ్మను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బాలికలు, యువతులు, మహిళలకు వేర్వేరుగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. బూరెడ్డి డిపార్ట్‌మెంట్ స్టోర్ యజమాని రాము కూడా ముగ్గుల పోటీలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు నిర్వహించిన అన్నసమారాధనను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కాపు సామాజిక సంఘం ఆధ్వర్యంలో మోదమ్మకు సారె ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావులు సారెను మోశారు. అనంతరం మోదమ్మకు సమర్పించారు.

వైభవంగా ఊరేగింపు

ఉత్సవం సందర్భంగా మోదమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ డప్పుల హోరుతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు సాగింది. పాతబస్టాండ్ ఆవరణలో ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు పాడేరు వాసులను ఆకట్టుకున్నాయి.



మోదకొండమ్మతల్లి సారెను ఊరేగిస్తున్న భక్తులు



ముగ్గులు వేస్తున్న మహిళలు

క్లుప్తంగా

కేజీహెచ్‌లో కొత్త ఐసీయూ

మహారాణిపేట: కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని యూరాలజీ వార్డులో ఆరు పడకలతో న్యూ ఐసీయూను ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూరాలజీ ఐసీయూ కోసం భావనగర్ వార్డుకు తీసుకొని వెళ్లేవారని, నేడు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే ఐసీయూ పెట్టడం వల్ల రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ డీసీహెచ్‌ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో విద్యార్థి ఆత్మహత్య

అల్లిపురం: మానసిక ఒత్తిడితో ఏయూ పీజీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, పారాపురం గ్రామానికి చెందిన తంగుడు శివకాశీ ప్రసాద్ (22) ఆంధ్రాయూనివర్సిటీలో పీజీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఏయూకు సెలవులు కావడంతో భానోజీనగర్‌లోని తన పినతల్లి ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి భోజనాలు చేసిన తరువాత నిద్రపోయిన అతడు ఆదివారం ఉదయం ఎంతకీలేవకపోవటంతో గది తలుపులు తెరిచి చూశారు. గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సోదరుడు కృష్ణతేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జ్యూస్ సెంటర్‌లోకి దూసుకెళ్లిన కారు

మాకవరపాలెం: జ్యూస్ సెంటర్‌లోకి కారు దూసుకెళ్లిన ఘటన మండలంలోని వెంకన్నపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్లి గణేష్‌కు విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారి పక్కనే జ్యూస్ సెంటర్ ఉంది. సాయంత్రం అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి జ్యూస్ సెంటర్‌పైకి దూసుకొచ్చింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

యోధుల మధ్య పోరు

- నేటి నుంచి విశాఖలో ఆల్‌ఇండియా పోలీస్ కమాండో పోటీలు
- పోటీలను ప్రారంభించనున్న రాష్ట్ర హోం మంత్రి
- 23 టాప్ కమాండో బృందాల పోటీ


ప్లాన్ బ్రీఫింగ్


పోటీలకు సిద్ధమవుతున్న గ్రేహౌండ్స్ గ్రౌండ్

విశాఖ స్పోర్ట్స్: అసాధారణమైన శక్తి సామర్థ్యాలతో శత్రుశ్రేణులపై పోరాడేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన యోధుడే కమాండో. వారి శారీరక, మానసిక దృఢత్వం, వ్యూహాత్మక నైపుణ్యాలు, షూటింగ్ పరాక్రమం, నాయకత్వ లక్షణాల అంచనా వేసేందుకు ఏటా ఆల్‌ఇండియా పోలీస్ కమాండో (ఏఐపీసీసీ) పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 13 ఎడిషన్స్ పూర్తి కాగా తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఆతిథ్యమివ్వనుంది. విశాఖలోని గ్రేహౌండ్స్ గ్రౌండ్స్‌లో సోమవారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల పోలీసుల బలగాలు, కేంద్ర సాయుధ బలగాలు పోటీపడనున్నాయి. దేశంలోని 23 ప్రత్యేక పోలీస్ బలగాల మధ్య పోటీలు జరగనున్నాయి. పోటీలను రాష్ట్రం హోం మంత్రి తానేటి వనిత ప్రారంభించనున్నారు.

ఐదు దశల్లో..

ఏఐపీసీసీ పేరిట విశాఖలో జరిగే పోటీల్లో దాదాపు 700 మంది కమాండోలు పోటీపడనున్నారు. వ్యక్తిగత పోటీలతో పాటు జట్టుగానూ పోటీలు జరగనున్నాయి. కమాండ్ కేటగిరీలో జరిగే పోటీలు దశల్లో జరుగుతాయి. ప్రతి దశలోనూ వ్యక్తిగా కాని దళంగా కాని పొందిన పాయింట్ల ఆధారంగా విజేతను ప్రకటిస్తారు. ఎలైట్ పర్వత శిక్షణ పొందిన ఫోర్స్ ఐటీబీపీ డిఫెండింగ్ చాంప్ హోదాలో బరిలోకి దిగనుంది. గతేడాది ఈ ఫోర్స్ మూడు వందల మార్కులకు గాను 262.85 పాయింట్లతో విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 235.19 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలోని ఐదు దశల్లో మొత్తంగా వంద పాయింట్లకు గాను పోటీ ఉంటుంది.

మానసిక శక్తి సామర్థ్యాల పరీక్ష

ఈసారి పోటీలను రాష్ట్ర గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.. పర్యవేక్షణ మాత్రం ఏఐపీఎస్‌సీ బోర్డ్ చేస్తోంది. బోర్డ్‌కు ఎక్స్‌అఫీషియో ఛైర్మన్‌గా ఐబీ డైరెక్టర్ ఉంటారు. ఆయన పదవీ కాలం రెండేళ్లు కాగా బోర్డు సభ్యులు ఆయనను ఎన్నుకుంటారు. ఈ పోటీల నిర్వాహణకు ప్రత్యేక శిక్షణ పొందిన టెక్నికల్ అఫీషియల్స్ ఉంటారు. వీరంతా సాయుధ బలగాల ఫోర్స్‌ల్లో నిష్ణాతులే.

ట్రోఫీలు ఇలా...

ఐదు దశల్లో పోటీలున్నా టీంలో ప్రతి దశలో ప్రతిభకు ట్రోఫీ ఉంటుంది. ఓవరాల్ ప్రతిభకు విజేతను నిర్ణయిస్తారు. బెస్ట్ పోలీస్ కమాండ్, బెస్ట్ స్టేట్ పోలీస్ ట్రోఫీ లుంటాయి. చీతా రన్ ట్రోఫీ, రణనీతి ట్రోఫీ, స్టాండ్ అలోన్ స్నైపర్ ఫైరింగ్, బ్లాక్ హాక్, చక్రవ్యూహ ట్రోఫీను అందిస్తారు. ఒక విధంగా ఏఐపీ కమాండో కాప్స్ అంచనా వేయడానికి ఈ పోటీలు దోహదపడతాయి.

ప్రతిష్ఠాత్మకంగా..



దేశంలోని 23 ప్రత్యేక దళాలకు చెందిన కమాండోలు పోటీపడుతున్నారు. పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నాం. సామర్థ్యం, నైపుణ్యం, ఓర్పుతో అత్యున్నత స్థానం పొందిన వారే విజేతలుగా నిలవనున్నారు. పోటీలు సజావుగా సాగేందుకు రక్షణ, సౌకర్యం, భద్రతకు ఉన్నత స్థాయి జాగ్రత్తలు తీసుకున్నాం. డీజీపీ కార్యాలయంతో పాటు సీపీ కార్యాలయం, రెవెన్యూ, జీవీఎంసీ చక్కటి తోడ్పాటు అందిస్తున్నాయి.

–మీనా, అడిషనల్ డీజీ

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. అర్చకుడు రఘునాథ్, గిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


మారథాన్‌లో పాల్గొన్న నగరవాసులు

బీచ్‌రోడ్డు: వైజాగ్ ఆల్ట్రా పేరుతో ఆదివారం బీచ్ రోడ్డులోని నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే, 5కే, 3కే విభాగాల్లో మారథాన్‌ను నిర్వహించారు. నగర వాసులే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు కూడా ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెడల్‌తో పాటు గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

సీఎం జగన్ సభకు స్థల పరిశీలన


మిందివానిపాలెం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో -ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు తదితరులు

తగరపువలస/ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఈనెల 27న నిర్వహించనున్న సభకు అనువైన స్థలం కోసం నాయకులు ఆదివారం పరిశీలన చేశారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విజయనగరం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు తదితరులు పర్యటించారు. సంగివలస జాతీయరహదారి పక్కన ఉన్న స్థలాన్ని, ఆనందపురం మండలంలోని శొంఠ్యాం పంచాయతీ పరిధిలోని మిందివానిపాలెం, పెద్దిపాలెం వద్ద గల స్థలాలను పరిశీలించారు. వాహన రాకపోకలు, పార్కింగ్ సదుపాయాలు, సీఎం రావడానికి వీలుగా హెలీపాడ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని స్థలాలను పరిశీలించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు రానుండడంతో అందరికీ అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర యూత్ కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, ఆనందపురం, భీమిలి జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, గాడు వెంకటప్పడు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఆనందపురం పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేయండి


వంజరి గ్రామంలో మాట్లాడుతున్న పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: విశాఖ జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పాడేరు నియోజకవర్గం సమన్వయకర్త, ఎస్టీ కమీషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు చెప్పారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి, వంజరి పంచాయతీ కేంద్రాల్లో సర్పంచ్‌లు, నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నవరత్నాల పథకాలతో పాటు అనేక పథకాలను అమలుచేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ, ప్రతిపక్ష నాయకుల కుట్రలు, ఆరోపణలు తిప్పికొట్టి వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి కూడా సురేష్, సర్పంచ్‌లు హనుమంతరావు, మాతే చిలకమ్మ, సీదరి కొండబాబు, ఎంపీటీసీ చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, జెసీఎస్ మండల కన్వీనర్ కళ్యాణం, రాష్ట్ర విద్యార్థి విభాగ జాయింట్ కార్యదర్శి మాతే వెంకటరామణ, నాయకులు దేముళ్లనాయుడు, సోమలింగం, పండన్న, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్ చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన


చిన్నారులను అభినందిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ కమిషనర్


పోటీలో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: ఎకో వైజాగ్ చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించింది. విశాఖను పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దే నేపథ్యంలో ఎకో వైజాగ్ మెగా ఆర్ట్ కాంటెస్ట్‌ను పోర్టు స్టేడియంలో జీవీఎంసీ, రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించింది. విశాఖ అభివృద్ధిపై నగర వాసుల్లో పెరుగుతున్న సామాజిక స్పృహ ఎంతో స్ఫూర్తిదాయకమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. పోటీలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ హరివెంకట కుమారి మాట్లాడుతూ.. రెండు వేల మందికిపైగా ఔత్సాహికులు పోటీలో పాల్గొని తమ సృజనాత్మకత చాటుకున్నారన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి సాకారానికి ఇటువంటి పోటీలు నిర్వహించడం చాలా అవసరమన్నారు. నగర ప్రజల సహకారంతో జాతీయస్థాయిలో విశాఖ 4వ పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కళాకారులు గీసిన చిత్రాలను ఎంపిక చేసి ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా నగదు బహుమతులు, అవార్డులు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యావరణహిత విశాఖను రూపొందించుకోవడంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఎకో వైజాగ్ అభివృద్ధి సహకారానికి ఇంతటి సామాజిక స్పృహ లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. జీవీఎంసీ భాగస్వామ్యంతో చిత్రలేఖన పోటీలు నిర్వహించిన రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపకుడు నాగేంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. పోటీల నిర్వహణకు ఆడిటోరియాన్ని ఉచితంగా అందించిన విశ్వనాథ గ్రూప్ చైర్మన్ కాశీ విశ్వనాథ రాజుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపునాయుడు, ఎకో వైజాగ్ నోడల్ అధికారి, ప్రాజెక్టు అధికారి డి.లక్ష్మీ, జీవీఎంసీ ఎస్‌ఆర్‌యూ కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజామణి తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల గెడ్డలో ఆధార్ కార్డులు

- బయటకు తీసిన వలంటీర్
- దిగుడుపుట్టు, డి.చింతల వీధి గ్రామస్తులకు చెందినవిగా గుర్తింపు


రాళ్లగెడ్డ వద్ద పడి ఉన్న ఆధార్ కార్డులు

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు, డి.చింతలవీధి తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు చేరవలసిన ఆధార్‌కార్డులు రాళ్లగెడ్డలో ఆదివారం ప్రత్యక్షమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లా పేరుతో ఇటీవల జారీ అయిన ఆధార్ కార్డులు మండల కేంద్రంలోని రాళ్లగెడ్డ వద్ద లభించాయి. గెడ్డవైపు బహిర్భూమికి వెళ్లిన వలింటీర్ గెడ్డ మధ్యలో ఉన్న ఆధార్ కార్డులను చూశాడు. స్థానికుల సాయంతో సుమారు 200 కార్డులను బయటకు తీశాడు. ఇవి హుకుంపేట పంచాయతీకి చెందిన దిగుడుపుట్టు, డి.చింతలవీధి గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు. మరికొన్ని ఆధార్ కార్డులు గెడ్డలో కొట్టుకుపోయాయి. లబ్ధిదారులకు పోస్టల్ ద్వారా చేరవలసిన ఆధార్‌కార్డులు ఇలా గెడ్డలో పడి ఉండడం పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని హుకుంపేట పోస్టుమాస్టర్ జీవన్‌ను వివరణకోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్వో రాజ్యలక్ష్మిని వివరణ కోరగా ఈ విషయమై పోస్టల్‌శాఖ అధికారులు లేఖరాస్తానని చెప్పారు.

కోతుల బెడదకు అడ్డుకట్ట


రంపచోడవరంలో పట్టుకున్న కోతులను అటవీ ప్రాంతంలో వదిలి పెట్టేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

రంపచోడవరం: మండల కేంద్రంలో కోతుల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ మంగా బొజ్జయ్య ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రంప రోడ్డు, గంగాలమ్మ గుడివీధి, సంత మార్కెట్ తదితరు వీధుల్లో ఆదివారం ప్రత్యేక సిబ్బంది ద్వారాసుమారు 500 కోతులను పట్టించారు. రంపచోడవరం కోతుల సంఖ్య పెరిగిపోవడంతో ఎంతో కాలంగా స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కోతులు గుంపులుగా ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను పట్టుకుపోవడంతో మహిళలు బేంబేలెత్తిపోయేవారు. వాహనచోదకులపై కోతులు దాడులు చేయడంతో అనేక మంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో కోతుల సమస్యను అరికట్టేందుకు గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

20 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్



రంపచోడవరంలో కోతులు అనేక విధాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రామంలో కోతుల సమస్య పరిష్కారానికి 20 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రంపచోడవరంలో కోతులు లేకుండా చేయాలనేదే నా లక్ష్యం. గ్రామంలో మిగిలిన చోట్ల ఎక్కడ ఎడెక్కడ నాన్నాయో గుర్తించి వాటిని పట్టుకునేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– మంగా బొజ్జయ్య, సర్పంచ్, రంపచోడవరం

రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన తేజ

గొలుగొండ: రెండు బైకులు అతివేగంగా వచ్చి ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఏఎల్‌పురంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో తీర్థం చూసేందుకు కొంకసింగి గ్రామానికి చెందిన కొలగాన తేజ(24) తన బైక్‌పై వచ్చాడు. గొలుగొండకు చెందిన నేమాపు మధు(20), చప్పా సూర్యకుమార్(26) మరో బైక్‌పై వచ్చారు. అర్ధరాత్రి సమయంలో కొలగాన తేజ తన స్నేహితుడిని గొలుగొండ మార్గంలో గుజ్జుమానుపాలక వద్ద దించి మరలా ఏఎల్‌పురం వెళ్తుండగా, అదే మార్గంలో గొలుగొండ వస్తున్న మధు, సుర్యకుమార్ బైకు పరస్పరం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మాకవరపాలెం వద్ద తేజ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. మధు తలకు బలమైన గాయం కాగా, సూర్యకుమార్ తలకు గాయమై కాలు, చేయి విరిపోయాయి. ప్రమాదంలో బైకులు నుజ్జునుజ్జు అయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

రూ.10 కోట్లతో విద్యుత్ కేంద్రానికి ప్రతిపాదనలు

- మామిడిపల్లిలో 4 ఎకరాల విస్తీర్ణంలో 132/33 కేవీ ఈహెచ్‌టీ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలన
- ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎస్‌ఈ ఎల్.మహేంద్రనాథ్ వెల్లడి


మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లిలో 132/33 కేవీ ఈహెచ్‌టీ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎస్‌ఈ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని తారువ నూతన సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

మామిడిపల్లిలో రూ.10 కోట్ల వ్యయంతో ఈ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు 4 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. చింతలపూడిలో రీ వేంపడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు రూ.3.50 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. తారువలో రూ.3.76 కోట్లతో నిర్మించిన 33/ కేవీ విద్యుత్ ఉప కేంద్రం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగిందని, దీని ఏర్పాటుకు గ్రామానికి చెందిన గొర్రుపోటు తమ్మునాయుడు 50 సెంట్ల స్థలాన్ని ఉచితంగా అందించారని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్‌తో దేవరాపల్లి, చీడికాడ మండలాలకు చెందిన 20 గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.

మాడుగుల నియోజకవర్గంలోని 10 విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా 78 వేల విద్యుత్ సర్వీస్‌లకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు త్రీఫేజ్ కరెంట్ 9 గంటలు, మిగిలిన కనెక్షన్లకు 24 గంటల పాటు ఇస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాకు ఎక్కడైనా అంతరాయం లేదా సమస్యలు ఉత్పన్నమైతే తమ శాఖకు చెందిన టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తద్వారా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

మొబైల్ యాప్‌లో కరెంటు బిల్లులు

కరెంట్ బిల్లులను మొబైల్ ద్వారా ఈస్టన్ పవర్ యాప్‌లో చెల్లించుకోవాలని, తద్వారా బిల్లును సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఎస్‌ఈ మహేంద్రనాథ్ స్పష్టం చేశారు. తారువ సబ్‌స్టేషన్ ద్వారా తమ గ్రామానికి విద్యుత్ సరఫరా చేయాలని ఎం.అలమండ ఎంపీటీసీ పోతల వెంకటరావుకు విద్యుత్‌శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈయన వెంట ఏపీఈపీడీసీఎల్ ఈఈలు చెల్లిబాబు, రాజ్‌కుమార్, రామకృష్ణ, డీఈఈ గౌరీ ప్రసాద్, స్థానిక ఏఈఈ కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.